నెరవేరనున్న రైతుల కల!

- బెండి గెడ్డపై ఎత్తిపోతల పథకానికి చర్యలు
- సర్వే చేసిన అధికారులు



బెండి ప్రాంతంలో సర్వే చేస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

వజ్రపుకొత్తూరు: బెండి ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మంత్రి సీదిరి అప్పలరాజు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించి ముందడుగు వేశారు. దీనిలో భాగంగా శనివారం ఏపీఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ నీటి పారుదల అభివృద్ధి సంస్థ)కి చెందిన అధికారులు బెండి ప్రాంతాన్ని సర్వే చేశారు. ఆ శాఖకు చెందిన అధికారులు బెండిగెడ్డ పరిసర ప్రాంతాల్లో లెవెల్స్ తీసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎత్తిపోతల పథకానికి ఈ ప్రాంతం అనువైనదని తేల్చడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎత్తిపోతల నిర్మాణం పూర్తయితే సుమారు 550 మంది రైతులకు చెందిన 670 ఎకరాలకు సాగు నీరు అందనుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వంశధార నుంచి సాగునీరు అందక రైతులు ఏటా పంటలను నష్టపోతున్నారు. ఈ సమస్యను దివంగత ఎంపీ హనుమంతు అప్పయ్యదొర సోదరుడు ప్రణాళికా సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటరావు దొర మంత్రి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లి ఎత్తిపోల పథకం మంజూరుకు కృషి చేశారు. పథకం నిర్మాణంకు అవసరమైన దాదాపు 25 సెంట్ల జిరాయితీ స్థలాన్ని సైతం వెంకటరావుదొర కుటుంబ సభ్యులు ఏపీఎస్ఐడీసీకి అప్పగించారు. ఈ సందర్భంగా డీఈఈ ఎం.కామరాజు, ఏఈఈ ఎస్.మధుసూదనరావులు మాట్లాడుతూ.. సుమారు రూ. 650 లక్షలతో నిర్మాణం అయ్యే ఈ పథకానికి ప్రస్తుతం హైడ్రలాజికల్ అనుమతుల కోసం ఎదురు చూస్తున్నట్టు పేర్కొన్నారు. సంబంధిత ఫైల్ విజయవాడలోని ఈఎన్‌సీ వద్ద ఉండడంతో మంత్రి అప్పలరాజు కృషితో రెండు రోజుల్లో అనుమతులు రానున్నాయని చెప్పారు. వారం రోజుల్లో సుమారు రూ.650 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దబొడ్డపాడు సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తమ్మినేని అప్పారావు, గృహసారథి హెచ్.అప్పలస్వామి, నీటి సంఘం మాజీ డైరెక్టర్ టి.రామయ్య, వై.రాజారావు, టి.వెంకటరావు, రైతులు మంత్రి అప్పలరాజుకు, వెంకటరావు దొరకు కృతజ్ఞతలు తెలియజేశారు

నవరత్నాలతో నవశకం

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి
- టెక్కలిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



రోటరీనగర్‌లో సంక్షేమాన్ని వివరిస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో నవశకం వచ్చిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. టెక్కలి గ్రామ సచివాలయం-1 పరిధిలో రోటరీనగర్, రేవతిపతివీధి, నవీన్‌నగర్, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కేవలం ఎన్నికల సమయాల్లో మాత్రమే అరకొర సంక్షేమ కార్యక్రమాలతో హడావుడి చేసేవారన్నారు. జగనన్న ప్రభుత్వంలో నిరంతరం సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, ఆర్.జయమోహన్, ఎం.శంకర్, కె.కామేష్, నాయకులు జి.అప్పలరెడ్డి, వై.అనంతయ్య, డి.పోలయ్య, డి.శ్రీనివాస్, ఎ.రవికుమార్, టి.లోకేష్, కె.చంద్రయ్య, బి.రాజేష్, బుసకల శ్రీను పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న దృశ్యం

మందస: ఉద్దాన ప్రాంతమైన దున్నవూరు పంచాయతీ మర్రిపాడు గ్రామంలో కమ్యూనిటీహాల్, పవర్‌బోరు, రక్షణగోడ నిర్మాణ పనులకు ఎంపీపీ డొక్కరి దానయ్య శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని ఉద్దానం ప్రాంతాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారన్నారు. దీంతో ఈ ప్రాంత సమస్యల పరిష్కరించడానికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, రాబోయే ఎన్నికలో మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ తిమ్మల కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యురాలు తెప్పల ఉమాపతి, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సాˆర ఢిల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ బొంగు పురుషోత్తం, డాక్టర్ వైఎస్సార్‌హెచ్‌యూ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు లబ్బ కమల, కూర్మారావు, రాజు, పాపారావు పాల్గొన్నారు.

అన్యాయాలపై మాట్లాడాలి



శంకరరావును సన్మానిస్తున్న సంఘ నాయకులు

మందస: గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలపై సంఘ నాయకులు మాట్లాడాలని ఆదివాసీ వికాస్ పరిషత్ నాయకులు అన్నారు. మందస పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌లో శనివారం ఆదివాసీ వికాస పరిషత్ సమావేశం అధ్యక్షుడు సవర జగన్ అధ్యక్షతన జరిగింది. నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను వివరించారు. ఇటీవల జరిగిన ఆదివాసీ దినోత్సవానికి సంఘానికి పిలుపు ఇవ్వలేదని, గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలు, భూ ఆక్రమణలపై సంఘాలు మాట్లాడాలన్నారు. ఆదివాసీ సంఘం రాజకీయ పార్టీ కాదన్నారు. గిరిజనుల ఆర్థిక అసమానతలను అధిగమించడానికి కృషి చేసిన ఎస్‌బీఐ క్యాషియర్ సవర శంకరరావు పలాసకు బదిలీ కావడంతో ఆయన్ని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డొంబురు, గణేశ్వరరావు, దండాసి, జయరాం, సోములయ్య, అప్పారావు, అబ్రహం, విజయ్, నారాయణ, కిరణ్, కామయ్య, సోమేశ్, ఉమాబిస్వాల్, నీలకంఠం, భువనేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



రాజావారి మైదానంలో ఖోఖో పోటీల్లో బాలికలు



మండపల్లిలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

ఇచ్ఛాపురం రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు శనివారం పలు ఆటల పోటీలను ఉపాధ్యాయులు నిర్వహించారు. క్రీడలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను తొలగించాలి



కాలువను పరిశీలిస్తున్న వసంతరెడ్డి తదితరులు

సంతబొమ్మాళి: కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించి పొలాలకు సక్రమంగా సాగునీరు అందించాలని జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి వంశధార అధికారులకు సూచించారు. వంశధార డీఈ సత్యన్నారాయణ, జేఈ అప్పలరెడ్డితో కలిసి బోరుభద్ర జీజీ చానల్ నుంచి పాలతలగాంలోని నూకల కనత వరకు సుమారు ఆరు కిలోమీటర్లు కాలువ గట్టుపై నడుస్తూ కాలువను శనివారం పరిశీలించారు. ఎండిపోతున్న పంట పొలాలు చూసి వంశధార అధికారుల్ని గట్టిగా నిలదీశారు. రైతులకు అన్యాయం జరగకుండా చూడామన్నారు. దీనిపై కలెక్టర్‌కు తెలియజేసి ఎమర్జెన్సీ ఫండ్ తెప్పిస్తానన్నారు. పరిశీలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు నక్క భీమారావు, పరపటి శ్రీనివాస్‌రెడ్డి, సవరయ్య, లక్షుమయ్య, కొండయ్య, చిన్నారావు, అప్పలనాయుడు, బర్ల రమణ, ముద్దపు ఆనంతరావులు ఉన్నారు.

మొక్కలు నాటివేత



మొక్కను నాటుతున్న నాయకులు

కాశీబుగ్గ: టెక్కలిపట్నం గ్రామంలోని కోనేరు గట్టుపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. సర్పంచ్ పానిల పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పానిల కృష్ణారావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్ మద్దు రంగారావు, కోరాడ కరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమీక్షిస్తున్న ఏడీ లోకనాథం

కోటబొమ్మాళి: పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏడీ మంద లోకనాథం సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో మండలంలోని 27 ఆర్‌బీకేల వెటర్నరీ అసిస్టెంట్లతో శనివారం సమీక్షించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పశువుల సంరక్షణకు పాడిరైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధుల నివారణకు మందులు పంపిణీ, టీకాలు సకాలంలో వేయాలన్నారు. సమావేశంలో కురుడు, నిమ్మాడ, తిలారు, పశువైద్యాధికారులు ఎల్.కిరణ్‌కుమార్, వెంకటేష్, ఎం.ప్రజ్ఞశ్రీ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

కంచిలి: జె.బెల్లుపడ పంచాయతీ మాజీ సర్పంచ్ ఆయుధం హరికృష్ణ ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి శనివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లద్దు కేశవపాత్రో, సర్పంచ్ జయరాం, జేసీఎస్ కన్వీనర్ కొనపల సురేష్, కొల్లూరు సర్పంచ్ పైల లక్ష్మీనారాయణ ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

సోంపేట: సుంకిడి గ్రామంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీని శుక్రవారం చేపట్టారు. సర్పంచ్ శిలగాన భాస్కరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగధనులకు వందనం

స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగాన్ని మరువలేమని వక్తలు అన్నారు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులకు వందనాన్ని సమర్పించారు. 75 ఏళ్ల స్వాతంత్య్ర అవశ్యకతను వివరించారు. మొక్కలను నాటారు. మట్టిని సేకరించి ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్య్ర సమర యోధుల వారసులు, మాజీ సైనికులను సన్మానించి గౌరవించారు.



ఇచ్ఛాపురం రూరల్: తులసిగాం పంచాయతీలో ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు నరేంద్ర యాదవ్



వజ్రపుకొత్తూరు రూరల్: పల్లిసారథిలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మానిస్తున్న ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి



సోంపేట: బుసాబద్ర పంచాయతీలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ తదితరులు



కవిటి:నెలవంకలో మట్టిని పట్టుకుని ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు



కంచిలి: కొల్లూరులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి



టెక్కలి రూరల్: పెద్దరోకళ్లపల్లి దేశ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సర్పంచ్ రామపాత్రుని రోజా, అధికారులు



నందిగాంలో విశ్రాంత జవాన్లను సత్కరిస్తున్న కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తదితరులు



వజ్రపుకొత్తూరు: బెండిలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

క్లుప్తంగా

చివరి దశకు వంతెన పనులు



పనుల్ని పరిశీలిస్తున్న డీఈఈ రామినాయుడు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బహుదా నదిపై కూలిన వంతెన స్థానంలో చేపడుతున్న ప్రత్యామ్నాయ ఏర్పాటు పనులు చివరి దశకు చేరుకున్నట్లు రోడ్లు భవనాల శాఖ డీఈఈ ఎస్.రామినాయుడు తెలిపారు. వంతెన వద్ద జరుగుతున్న పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాళ్లను పేర్చి వాటిపై ఎర్రటి రాళ్లతో పొరను వేయడం పూర్తయిందన్నారు. వంతెన పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు చిన్నపాటి పనులు ఉన్నాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యామ్నాయ వంతెనపై నుంచి పెద్ద వాహనాలను నిషేధిస్తూ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయన వెంట జేఈ మోహనరావు, సిబ్బంది ఉన్నారు.

రంగనాథన్‌కు ఘనంగా నివాళి



టెక్కలి: రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

టెక్కలి: దేశంలో గ్రంథాలయాల అభివృద్ధికి ఎస్.ఆర్.రంగనాథన్ చేసిన కృషి ఎనలేనిదని టెక్కలి శాఖా గ్రంథాలయాధికారి బి.రూపావతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విశ్రాంత గ్రంథాలయాధికారులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారులు జి.ప్రసాదరావు, టి.వైకుంఠరావు, కె.బి.సుబ్రహ్మణ్యం, ఎస్.రామారావు, లైబ్రేరియన్ జి.భారతి పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



పరామర్శలో వామపక్ష నాయకులు

పలాస: ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్, సీపీఎం నాయకులు బొడ్డు వాసుదేవరావు, బి.ఆనందరావులు కోరారు. ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందిన మాకన్నపల్లి గ్రామానికి చెందిన రాపాక చిన వెంకటరావు కుటుంబాన్ని శనివారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాకన్నపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి స్పందన చిన్నవయసులో కిడ్నీ వ్యాధితో మృతి చెందారన్నారు. యుక్త వయస్సులో ఉన్న క్రీడాకారులు, కళాకారులు, యువకులు కిడ్నీ వ్యాధికి బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

డ్వాక్రా మహిళలకు సబ్సిడీ రుణాలు

కోటబొమ్మాళి: మండలంలోని 38 పంచాయతీల్లో డ్వాక్రా మహిళలకు పీఎంఈజీపీ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా వ్యాపారాలు స్థాపించేందుకు 35 శాతం సబ్సిడీతో పది లక్షల రూపాయల వరకూ బ్యాంకు రుణాలు మంజూరు చేయనున్నట్లు ఏపీఎం కె.రాము తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలు ఆధార్, రేషన్, పాన్ కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకం, కులధ్రువీకరణ పత్రం, పాస్‌ఫొటోతో ఐకేపీ–వెలుగు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి



బరడ అప్పారావు (ఫైల్)

నందిగాం: ఆకులర ఘునాధపురం వీఆర్వో బరడ అప్పారావు(55) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవం కోసం ఏర్పాట్లు చేసుకొని మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ఆయనకు గుండెపోటు రావడంతో ప్రాణాలు కోల్పోయారు. మృతునికి భార్య చిన్నమ్మి, కుమారుడు రమేష్ ఉన్నారు. అప్పారావు మృతి విషయం తెలుసుకున్న వీఆర్ఏల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి త్రినాథ్, మండల సర్వేయర్ జోగారావు, జేసీఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం, కురమాన బాలకృష్ణారావు, అంబడి విష్ణు తదితరులు గ్రామానికి చేరుకొని అంతిమయాత్రలో పాల్గొన్నారు. అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

సంక్షిప్తంగా...

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



రేషన్ సరుకులు అందజేస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని దొలాయి సాయి గిరిజన గ్రామంలో శుక్రవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాద బాధితులకు సోంపేట సత్యసాయి సేవా సమితి సభ్యులు రేషన్ సరుకులను శనివారం అందజేశారు. మూడు కుటుంబాలకు రెండు నెలలకు సరిపడే కిరాణా సరుకులు, దుస్తులు, దోమ తెరలు, ప్లేట్లు అందించారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కంచిలి: స్వయంశక్తి సంఘ సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం పి.ఉమారాణి అన్నారు. కంచిలి మండల మహిళా సమాఖ్యలో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌పై వీవోఏలు, గ్రామసంఘ అధ్యక్షులకు శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు.

దివ్యాంగురాలుకి అండగా..



కోమలికి సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: చనిపోయిన స్నేహితుడు కుమార్తెకు పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. పలాస ప్రభుత్వ హైస్కూల్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న సురంగి సింహాచలం ఇటీవల మరణించారు. ఇతని భార్య కూడా రెండేళ్ల క్రితం మరణించారు. దీంతో 16 ఏళ్ల దివ్యాంగ కుమార్తె కోమలి ఒంటరిగా మారింది. ఆదరణలేని కోమలి గొప్పిలి గ్రామంలోని తన అమ్మమ్మ ఇంట్లో తల దాచుకుంటుంది. విషయం సింహాచలంతో చదువుకున్న పూర్వ విద్యార్థులకు తెలియడంతో 15 వేల రూపాయలు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు సేకరించారు. వీటిని కోమలికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లండ పాపారావు, కొవ్వూరు రాజేష్, రట్టి మనోజ్‌కుమార్, సనపల హరి, బొమ్మాళి మల్లి, గుడియా శశికాంత్ పాల్గొన్నారు.

ప్రజా అంబులెన్సు ప్రారంభం

కాశీబుగ్గ: ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజా అంబులెన్సు సర్వీసును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు సభ్యులు ఎస్.ఈశ్వరరావు, టి.తేజేశ్వరరావు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐదు సంవత్సరాలుగా ఆ నలుగురు ట్రస్ట్ రక్తదాన కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందింది. ఇప్పుడు నిరుపేదల అత్యవసర పరిస్థితుల కోసం ఉచిత అంబులెన్సు ప్రారంభించామన్నారు. అవసరం ఉన్నవారు 94948 74383, 96766 03047 నంబర్లను సంప్రదించాలన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పరిసర ప్రాంతాల వారికి అందుబాటులో ఉంచామన్నారు.

సాగునీటి కాలువ కబ్జా



చిన్న నారాయణపురం వద్ద కబ్జాకు గురైన కాలువ

టెక్కలి: చిన్ననారాయణపురం గ్రామంలోని సాగునీటి కాలువ కబ్జాకు గురైందని స్థానికులు వాపోతున్నారు. వంశధార కాలువ నుంచి గొడ్డరాముడు చెరువు లింక్ చానల్‌ను కొంతమంది వ్యక్తులు కబ్జా చేసినట్టు చెబుతున్నారు. దీంతో వందలాది ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గత ఏడాది ఇదే మాదిరిగా కబ్జా జరిగినపుడు స్థానిక రైతులంతా అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో అధికారులు సర్వే చేసి కబ్జాను తొలగించారు. ఇప్పుడు మరళా ఇదే పరిస్థితి చోటు చేసుకుందని పలువురు రైతులు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందించి శాశ్వతమైన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.